TGTEL /2018/75056

# తెలంగాణభూమి

తెలుగు దినపత్రిక




నల్గొండ | ఆగస్టు 11 మంగళవారం 2026 | సంపుటి : 9 | సంచిక : 53 | పేజీలు : 4 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : కొండ నరసింహస్వామి

NALGONDA | TUESDAY AUGUST 11 2026 | VOL:9 ISSUE: 53 | PAGES:4 | Rs. 4:00 | EDITOR: Konda Narasimha swamy

# వరుణయాగం పూర్ణాహుతిలో పాల్గొన్న సిఎం రేవంత్ దంపతులు





**నాగార్జునసాగర్, ఆగస్ట్ 10**


నాగార్జునసాగర్ లో జరిగిన వరుణయాగం పూర్ణాహుతిలో సిఎం రేవంత్ రెడ్డి దంపతులు, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఎల్‌నినోను ఎదుర్కొని ప్రకృతిని ప్రసన్నం చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం 'మహా వరుణ యాగం' చేపట్టింది. రాష్ట్రంలో వర్షాలు పడాలని నల్గొండ జిల్లాలోని నాగార్జున సాగర్ విజయ్ విహార్ టూరిజం గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో వరుణయాగం కార్యక్రమం చేపట్టారు. 108 మంది రుత్వికులతో, 11 హోమగుండాలతో, యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో ఈ యాగం జరుగుతోంది. వరుణయాగంలో భాగంగా మహా పూర్ణాహుతిలో సిఎం రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు.

## సమగ్ర చర్చకు సిద్ధం : కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు



న్యూఢిల్లీ : దేశ రాజధానిలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై పోలీసులు ప్రవర్తించిన తీరుపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. విద్యార్థుల ఉద్యమానికి సంబంధించిన ప్రతి అంశంపైనా చర్చించేందుకు కేంద్రం సిద్ధమేనని ఆయన సోమవారం తెలిపారు. అయితే, సభా కార్యక్రమాలను అడ్డుకునేలా విపక్షాలు హంగామా చేయకూడదని స్పష్టం చేశారు.వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు (మిగతా 2వ పేజీలో..)

## ఇండియాకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు : రష్యా వ్యోమగాములు



న్యూఢిల్లీ : అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో (ఐఎస్ఎస్) ఉన్న రష్యన్ వ్యోమగాములు భారత దేశ ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భారతదేశ త్రివర్ణ పతాకాన్ని చేబూని, ప్రజలకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా భారత్--రష్యా మధ్య ఉన్న సుదీర్ఘ అంతరిక్ష సహకారాన్ని (మిగతా 2వ పేజీలో..)

## ఈ నెల 14వ తేదీన రాష్ట్ర కేబినెట్ సమావేశం

**హైదరాబాద్, ఆగస్ట్ 10**

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 14వ తేదీన ఉదయం 10.30 గంటలకు నిర్వహించ నున్నారు. రాష్ట్ర సచివాలయంలో (మిగతా 2వ పేజీలో..)



## ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ దరఖాస్తు గడువు పొడిగింపు : గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ఆగస్టు 15 వరకు దరఖాస్తుల స్వీకరణ**

**ఇప్పటివరకు 46,121 దరఖాస్తులు**

**వరుస సెలవుల నేపథ్యంలో మరో ఐదు రోజులు అవకాశం**



**హైదరాబాద్, ఆగస్టు 10**

హైదరాబాద్ క్యూర్ పరిధిలోని ప్రజల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకంలో దరఖాస్తుల స్వీకరణ గడువును మరో ఐదు రోజుల పాటు పొడిగిస్తున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆగస్టు 15వ తేదీ శనివారం వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు వెల్లడించారు. అత్యంత విలువైన ప్రభుత్వ భూములను ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చి, నామమాత్రపు ధరలోనే పేద, మధ్యతరగతి ప్రజలకు సొంత ఇంటిని అందించాలన్నది ప్రభుత్వ (మిగతా 2వ పేజీలో..)

## తెలంగాణలో ముగిసిన సర్ ప్రక్రియ

**హైదరాబాద్, ఆగస్ట్ 10**

తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ఎన్యూమరేషన్ ప్రక్రియ ముగిసింది. రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు తేల్చారు. తెలంగాణలో 73,95,954 మంది ఓటర్లను (మిగతా 2వ పేజీలో..)




## జార్ఖండ్‌లో ఉద్రిక్తత... విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్

రాంచి (జార్ఖండ్) : జార్ఖండ్‌లో నిరసన చేపడుతున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో పాటు వాటర్ కెనాన్‌లు (మిగతా 2వ పేజీలో..)



# మావోయిస్టు కంచుకోట కర్రిగుట్టలో డీజీపీ సీవీ ఆనంద్ పర్యటన

**మావోయిస్టు స్థావరం నుంచి పర్యాటక కేంద్రంగా కర్రిగుట్ట**

**50 ఏళ్ల తర్వాత శాంతి.. అభివృద్ధికి శ్రీకారం**

**రహదారి పనులను పరిశీలించిన డీజీపీ**

**మావోయిస్టుల లొంగుబాటుకు పునరావాస చర్యలు**

**సీఆర్పీఎఫ్ సేవలను అభినందించిన సీవీ ఆనంద్**



**ములుగు, ఆగస్టు 10**

ఒకప్పుడు మావోయిస్టుల కార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా ఉన్న తెలంగాణ--ఛత్తీస్‌గఢ్--ఒడిశా సరిహద్దులోని కర్రిగుట్టలో ఇప్పుడు శాంతి నెలకొనడంతో అభివృద్ధి, పర్యాటక మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. సోమవారం కర్రిగుట్టను సందర్శించిన డీజీపీ సీవీ ఆనంద్.. మారుమూల అటవీ ప్రాంతంలో కొనసాగుతున్న రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం జాతీయ జెండాను (మిగతా 2వ పేజీలో..)

తెలంగాణభూమి
తెలుగు దినపత్రిక

# సమగ్ర చర్చకు సిద్ధం : కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభమైనకానుంచి ప్రతిపక్షాలు ఏకతాటిపై నిలిచాయి. జూలై 20న నీట్ పేపర్ లీక్ ను వ్యతిరేకిస్తూ సీజేపీ ఆధ్వర్యంలో విద్యార్థులు భారీ ఆందోళనలకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. పార్లమెంట్ వైపుగా సాగుతున్న విద్యార్థుల శాంతి యుత నిరసనలపై ఒక్కసారిగా పోలీసులు లాఠీచార్జ్ చేశారు. ఈ ఘటనలో అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. ఢిల్లీలో విద్యార్థులపై టియర్ గ్యాస్, మేకులు అమర్చిన లాఠీలతో దాడి, పెల్లెట్ గన్స్ ప్రయోగించారని ప్రతిపక్షాలు మండిపడ్డాయి. కేంద్ర ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిస్తూ విపక్షాలు ఆందోళన చేపట్టాయి. ఈ ఘటనపై సమగ్రంగా ఉభయ సభల్లో చర్చ జరగాలని డిమాండ్ చేశాయి. ఎట్టకేలకు దిగొచ్చిన మోడీ ప్రభుత్వం చర్చకు అంగీకరించింది.కేంద్ర మంత్రి తాజా ప్రకటనతో పార్లమెంట్‌లో ఎలాంటి వాడీవేడి చర్చ జరగనుందోననే ఆసక్తి నెలకొంది.

# ఇండియాకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు : రష్యా వ్యోమగాములు

(మొదటి పేజీ తరువాయి)

గుర్తు చేసుకున్నారు. "ప్రియమైన స్నేహితులారా.. నేడు గణతంత్ర భారతదేశం 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటోంది" అని ప్యోటర్ డుబ్రోవ్ పేర్కొన్నారు. భారత ప్రజలకు శాంతి , శ్రేయస్సు కలగాలని ఆకాంక్ష?ంచారు. మానవ అంతరిక్ష ప్రయాణంలో కీలక ఘట్టమైన సోవియట్ వ్యోమగామి యూరీ గగారిన్ అంతరిక్షంలోకి వెళ్లి 65 ఏళ్లు పూర్తవుతున్న విషయాన్ని ప్రస్తావించారు. యూరీ గగారిన్ 1961 నవంబర్‌లో భారత్‌ను సందర్శించారు. ఆ సమయంలో భారత్, సోవియట్ యూనియన్ మధ్య బలపడుతున్న స్నేహానికి ఆయన ఒక ప్రతీకగా నిలిచారు. అంతరిక్షం నుంచి చూస్తే భారత్ ఎంతో అందంగా కనిపించిందని, అయితే భూమిపైకి వచ్చాక అది మరింత అందంగా ఉందని, ఎందుకంటే ఇక్కడ నిజమైన స్నేహితులు ఉన్నారని గగారిన్ చెప్పిన మాటలను రష్యా వ్యోమగాములు గుర్తుచేశారు. భారత్--రష్యా అంతరిక్ష సహకారం 1975లో భారత తొలి ఉపగ్రహం 'ఆర్యభట్ట'ను సోవియట్ రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి పంపడంతో ప్రారంభమైంది. ఆ తర్వాత 1984లో రాకేష్ శర్మ సోవియట్ అంతరిక్ష నౌక 'సోయుజ్ టీ-11'లో అంతరిక్షంలోకి వెళ్లిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించారు. ఈ ఘనత రెండు దేశాల మధ్య అంతరిక్ష సంబంధాలను మరింత బలోపేతం చేసింది. ప్రస్తుతం భారత్ చేపట్టిన 'గగన్‌యాన్' మానవ సహిత అంతరిక్ష కార్యక్రమంతో ఈ భాగస్వామ్యం కొత్త దశలోకి ప్రవేశించిందని రష్యా వ్యోమగామి అన్నా కికీనా పేర్కొన్నారు. గగన్‌యాన్ మిషన్‌కు ఎంపికైన భారతీయ వ్యోమగాములు 'గగన్‌యాత్రులు'గా పిలుస్తున్నారు. వీరికి రష్యాలోని యూరీ గగారిన్ కాస్మోనాట్ శిక్షణా కేంద్రంలో శిక్షణ కూడా అందించారు. అంతరిక్ష సహకారాన్ని గుర్తుచేసుకుంటూ రష్యా అంతరిక్ష సంస్థ రోస్‌కాస్మోస్, భారత్‌లోని దాని కార్యాలయం, ఇస్రో కలిసి నిర్వహించిన పోటీని కూడా వ్యోమగాములు ప్రస్తావించారు. ఆ పోటీలో విజేతలుగా నిలిచిన వారి చిత్రాలను స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షల సందేశాలతో పాటు అంతరిక్ష కేంద్రంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా "భారత్--రష్యా స్నేహం వర్ధిల్లాలి" అని మరో రష్యా వ్యోమగామి ఆండ్రే ఫెద్యాయెవ్ ఆకాంక్షించారు.

# ఈ నెల 14వ తేదీన రాష్ట్ర కేబినెట్ సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరుగనున్న మంత్రివర్గ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పాలనాపరమైన కీలక నిర్ణయాలపై కేబినెట్ భేటీలో చర్చించనున్నట్లు తెలిసింది.

# తెలంగాణలో ముగిసిన సర్ ప్రక్రియ

(మొదటి పేజీ తరువాయి)

తొలగించినట్లు సమాచారం. ఇప్పటివరకు 2,64,30,494 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయ్యింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 78.14 శాతం డిజిటలైజేషన్ నమోదైంది.అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 94.30 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. ఆ తర్వాతి స్థానాల్లో మెదక్ 90.54 శాతం, సూర్యాపేట 90.43 శాతంతో ఉన్నాయి. ఇక, హైదరాబాద్ 27,74,687 ఎన్యూమరేషన్ ఫారాలతో 58.58 శాతం డిజిటలైజేషన్ పూర్తై చివరి స్థానంలో నిలిచింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 63.82 శాతం, రంగారెడ్డి జిల్లాలో 64.91 శాతం, కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 89.45 శాతం, జగిత్యాల జిల్లాలో 89.60 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. రెండు సార్లు గడువు పొడిగించినప్పటికీ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో డిజిటలైజేషన్ శాతం పెరగలేదు. కాగా, తెలంగాణలో సర్ ప్రక్రియ పూర్తయినట్లు ఈనెల 12న సీఈవో ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది. అలాగే, ఈ నెల 17న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల కానున్నట్లు సమాచారం. ఆ తర్వాత నెల రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణ కొనసాగనుంది. అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా విడుదల కానుంది.

# మావోయిస్టు కంచుకోట కర్రిగుట్టలో డీజీపీ సీవీ ఆనంద్ పర్యటన

(మొదటి పేజీ తరువాయి)

ఆవిష్కరించి, శాంతికి ప్రతీకగా తెల్ల పావురాలను ఎగురవేశారు. పోలీస్, సీఆర్పీఎఫ్, అటవీ, రెవెన్యూ, పర్యాటక శాఖలకు చెందిన ఉన్నతాధికారులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన డీజీపీ.. తెలంగాణ పోలీస్, గ్రేహౌండ్స్, స్పెషల్ పోలీస్ బలగాలు, సీఆర్పీఎఫ్, కోబ్రా దళాలు, ఛత్తీస్‌గఢ్ పోలీసుల సమన్వయంతో చేపట్టిన ఆపరేషన్ల వల్ల ఈ ప్రాంతంలో మావోయిస్టుల కార్యకలాపాలు గణనీయంగా తగ్గాయని తెలిపారు. ఆపరేషన్ కగార్ సమయంలో దాదాపు 700 మంది మావోయిస్టులు లొంగిపోయారని, పలువురు కీలక నేతలు ఎన్‌కౌంటర్లలో మృతి చెందగా.. మరికొందరు జనజీవన స్రవంతిలోకి తిరిగి వచ్చారని చెప్పారు. దేశవ్యాప్తంగా ప్రస్తుతం కొద్దిమంది కేంద్ర కమిటీ స్థాయి నేతలు మాత్రమే క్రియాశీలకంగా ఉన్నారని తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టుల పునరావాసానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని డీజీపీ వివరించారు. ఆర్థిక సహాయం, భూమి కేటాయింపు, జీవనోపాధి అవకాశాలు కల్పించడంతో పాటు వారు సమాజంలో తిరిగి స్థిరపడేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

పర్యాటక కేంద్రంగా కర్రిగుట్ట

కర్రిగుట్టకు అపారమైన పర్యాటక అవకాశాలు ఉన్నాయని సీవీ ఆనంద్ తెలిపారు. పర్యావరణ, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. పామూరు నుంచి చలమాదవ వరకు తారు రోడ్డు పనులు పూర్తయ్యాయని, త్వరలో బీటీ రోడ్డు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. రహదారి కనెక్టివిటీ మెరుగుపరచడంతో పాటు విద్యుత్, మొబైల్ నెట్‌వర్క్, ఇతర మౌలిక వసతులను కల్పించి పర్యాటక అభివృద్ధికి అనుకూల వాతావరణం సృష్టించనున్నట్లు చెప్పారు. పామూరు క్యాంపు సమీపంలో నివసిస్తున్న గుత్తి కోయ కుటుంబాలకు డీజీపీ నిత్యావసర సరుకులను పంపిణీ చేసి, ప్రభుత్వం నుంచి నిరంతర సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సీఆర్పీఎఫ్ సేవలకు ప్రశంసలు మావోయిస్టు వ్యతిరేక కార్యకలాపాల్లో దశాబ్దాలుగా రాష్ట్ర పోలీసులతో కలిసి పనిచేస్తున్న సీఆర్పీఎఫ్ సిబ్బంది సేవలను డీజీపీ సీవీ ఆనంద్ ప్రత్యేకంగా ప్రశంసించారు. కఠినమైన అటవీ ప్రాంతాల్లో 196వ బెటాలియన్ సీఆర్పీఎఫ్ సిబ్బంది నెలల తరబడి కుటుంబాలకు దూరంగా విధులు నిర్వహిస్తున్నారని, వారి అంకితభావం, వృత్తి నైపుణ్యం ఈ ప్రాంతంలో శాంతి పునరుద్ధరణలో కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీజీపీ సంజయ్ జైన్, ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, ఇంటెలిజెన్స్ ఐజీ కార్తికేయ, ఎస్ఐబీ ఎస్పీ సింధు శర్మ, ములుగు కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, ములుగు ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనా, సీఆర్పీఎఫ్ అధికారులు, రెవెన్యూ, పర్యాటక శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ దరఖాస్తు గడువు పొడిగింపు : గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

లక్ష్యమని మంత్రి తెలిపారు. హైదరాబాద్ అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ పథకం ద్వారా లక్ష ఇళ్లను నిర్మిస్తున్నామని, అందులో భాగంగా పైలట్ ప్రాజెక్టుగా 16 నియోజకవర్గాల్లో 7,340 ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టామని ఆయన వివరించారు. ఇందిరమ్మ ఇండ్లు టవర్స్కు ప్రజల్లో విశేష స్పందన లభిస్తోందని, పెద్ద సంఖ్యలో దరఖాస్తులు అందుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. అయితే రెండో శనివారం, బోనాల పండుగ తదితర వరుస సెలవుల కారణంగా దరఖాస్తు చేసుకునేందుకు ప్రజలకు ఇబ్బంది కలగకుండా గడువు పొడిగించాలంటూ వివిధ వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుందని తెలిపారు. ఈ నేపథ్యంలో దరఖాస్తుల స్వీకరణ గడువును మరో ఐదు రోజుల పాటు పొడిగించి ఆగస్టు 15 వరకు అవకాశం కల్పించాలని నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు. తొలుత ప్రకటించిన ప్రకారం దరఖాస్తుల స్వీకరణ గడువు ఆగస్టు 10, సోమవారం వరకు ఉంది. గత నెల జూలై 21వ తేదీ నుంచి మీ-సేవా కేంద్రాలతో పాటు ఆన్‌లైన్ ద్వారా, మీ-సేవా వాట్సాప్ సేవ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఆగస్టు 10, సోమవారం సాయంత్రం నాటికి మొత్తం 46,121 దరఖాస్తులు అందినట్లు మంత్రి తెలిపారు. వరుసగా సెలవులు రావడంతో మరింత మంది అర్హులకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలన్న ఉద్దేశంతో గడువు పొడిగించినట్లు మంత్రి పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణకు సంబంధించి అన్ని అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు.దరఖాస్తుల స్వీకరణ గడువును పెంచినప్పటికీ, దరఖాస్తుల పరిశీలన, అర్హత నిర్ధారణ, కేటాయింపు, లాటరీ తదితర ప్రక్రియల్లో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు స్పష్టం చేశారు. ఈ నెలాఖరు నాటికి ఇళ్ల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.ఇళ్ల కేటాయింపు ప్రక్రియపై దరఖాస్తుదారులు ఎటువంటి అపోహలు, అనుమానాలకు గురికావాల్సిన అవసరం లేదని మంత్రి తెలిపారు. అర్హత ప్రమాణాలకు అనుగుణంగా, పూర్తి పారదర్శకతతో, నిష్పక్షపాతంగా ఇళ్ల కేటాయింపు ప్రక్రియను నిర్వహిస్తామని స్పష్టం చేశారు. నియోజకవర్గాల వారీగా వచ్చిన దరఖాస్తులు

నియోజకవర్గం వారీగా

దరఖాస్తులు ఇలా ఉన్నాయి.

అంబర్‌పేట 3,073, బహదూర్‌పుర 1,706,

ఇబ్రహీంపట్నం 1,031, కార్వాన్

2,184, ఖైరతాబాద్ 5,518.

కూకట్‌పల్లి 6,615, మహేశ్వరం

734. మలక్‌పేట 3,609. మల్కాజిగిరి 1,333. మేడ్చల్

1,668. నాంపల్లి 4,372.

కుత్బుల్లాపూర్ 5,571.

రాజేంద్రనగర్ 2,060. సనత్‌నగర్ 1,404. సికింద్రాబాద్ (కంటోన్మెంట్) 1,755. శేరిలింగంపల్లి 3,488. మొత్తం

46,121.

# జార్ఖండ్‌లో ఉద్రిక్తత... విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్

(మొదటి పేజీ తరువాయి)

ప్రయోగించారు. జార్ఖండ్‌లో నియామక పరీక్షలలో జరిగిన అక్రమాలకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న వేలాది మంది యువత సోమవారం అసెంబ్లీకి ర్యాలీగా వెళ్లారు. విద్యార్థులను అడ్డుకునేందుకు పోలీసులు ముందస్తుగా బారికేడ్లను ఏర్పాటు చేశారు. అయితే విద్యార్థులు బారికేడ్లను దాటుకుని అసెంబ్లీ వైపు దూసుకువెళ్లేందుకు యత్నించడంతో పోలీసులు వాటర్ కెనాన్‌లు ప్రయోగించారు. పరీక్షల అక్రమాలకు నిరసనగా గత తొమ్మిది రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న 'జార్ఖండ్ లోక్‌తాంత్రిక్ క్రాంతికారీ మోర్చా' నేత దేవేంద్ర నాథ్ మహతో కూడా ఈ ర్యాలీలో పాల్గొన్నారు. నిరవధిక నిరాహార దీక్ష? కారణంగా ఆయన 10.5 కిలోల బరువు తగ్గారు. అయినప్పటికీ ర్యాలీలో పాల్గొన్నారు. ఆయన జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబు సోరెన్ చిత్రపటాన్ని పట్టుకుని కనిపించారు. చర్చలతోనే పరిష్కారం కనుగొంటామని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ఆదివారం స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఆదివారం ఆరోసారి విద్యార్థుల ప్రతినిధులతో ప్రభుత్వం చర్చలు జరిపింది. చర్చల అనంతరం 14వ జేపీఎస్సీ సంయుక్త సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షతో సహా మూడు పరీక్షలను రద్దు చేసేందుకు జార్ఖండ్ ప్రభుత్వం ఆదివారం అంగీకరించింది. అయినా విద్యార్దులు వెనక్కి తగ్గలేదు. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జేపీఎస్సీ)కి చెందిన ముగ్గురు సభ్యులు కూడా ఆదివారం రాజీనామా చేశారు. ప్రభుత్వంతో చర్చల సందర్భంగా విద్యార్థులు చేసిన పలు ప్రతిపాదనలకు ప్రభుత్వం అంగీకరించామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే జెఎస్ఎస్‌సి-సిజిఎల్ పరీక్ష?లో జరిగిన అవతవకలపై సిబిఐ విచారణ చేపట్టాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. సిబిఐ విచారణకు ఆదేశించేంత వరకు ఈ నిరసన కొనసాగుతుందని స్పష్టం చేశారు. నేడు అసెంబ్లీ మార్చ్‌కి పిలుపునిచ్చారు. దీంతో రాంచీలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బిజెపి విద్యార్థులను రెచ్చగొట్టేందుకు యత్నిస్తోందని జార్ఖండ్ మంత్రి ఇర్ఫాన్ అన్సారీ విమర్శించారు.



# మహా వరుణయాగానికి ఆటంకాలు సృష్టించే కుట్రలను ఖండించిన బీజేపీ నాయకులు

**శాలి గౌరారం 10 ఆగష్టు తెలంగాణ భూమి ప్రతినిధి**

రైతుల శ్రేయస్సు కోసం నిర్వహిస్తున్న యాగానికి ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పించాలి

శాలిగౌరారం: రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, జలాశయాలు నిండాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ నాగార్జునసాగర్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహా వరుణయాగానికి ఆటంకాలు కలిగించే ప్రయత్నాలను బీజేపీ నాయకులు తీవ్రంగా ఖండించారు.మహా వరుణయాగం నేపథ్యంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా శాలిగౌరారం పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకులను బైండోవర్ చేశారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు, జలాశయాలు నిండాలని, రైతులకు సాగునీటి కొరత లేకుండా పంటలు పండాలని కోరుకుంటూ నిర్వహిస్తున్న మహా వరుణయాగానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల సంక్షేమం, రైతుల శ్రేయస్సు కోసం నిర్వహించే కార్యక్రమాలను రాజకీయాలకు అతీతంగా చూడాలని వారు సూచించారు. మహా వరుణయాగం ప్రశాంతంగా కొనసాగేందుకు ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్





చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ అధ్యక్షుడు షేక్ సయ్యద్, జిల్లా కౌన్సిల్ మెంబర్ జమ్ము రమేష్, జిల్లా నాయకులు కుంభం నరసింహ, మండల ప్రధాన కార్యదర్శి చాడ శ్యాంసుందర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు మదగోని యాదగిరి తదితరులు పాల్గొన్నారు. వేముల ఆంజనేయులు శాలిగౌరారం మండల ఎస్సీ మోర్చా అధ్యక్షులు

# సెలబ్రిటీల మెరుపు మీ సొంతం.. గ్లోయింగ్ స్కిన్ కోసం కొన్ని చిట్కాలు

సెలబ్రిటీలలా మెరిసిపోయే చర్మ సౌందర్యం పొందాలని చాలామంది మహిళలు కోరుకుంటారు. అయితే అది కేవలం కొందరికే సాధ్యమని అనుకుంటే పొరపాటే. సరైన జాగ్రత్తలు, కాస్త సమయం కేటాయిస్తే ఎవరైనా సరే సహజమైన, ఆరోగ్యకరమైన గ్లోయింగ్ స్కిన్ పొందవచ్చని సౌందర్య నిపుణులు చెబుతున్నారు. డెర్మటాలజిస్టులు, మేకప్ ఆర్టిస్టులు మెరిసే చర్మం కోసం పాటించాల్సిన కొన్ని ముఖ్యమైన చిట్కాలను పంచుకున్నారు.ఆరోగ్యకరమైన చర్మం కోసం ఒక్కటే మంత్రం అంటూ ఏదీ లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మంచి ఆహారం, తగినంత నిద్ర, ఒత్తిడిని తగ్గించుకోవడం, సరైన స్కిన్‌కేర్ రొటీన్ పాటించడం వంటివి చాలా అవసరం. ముఖ్యంగా కొన్ని అలవాట్లను దినచర్యలో భాగం చేసుకోవడం ద్వారా చర్మంలో స్పష్టమైన మార్పు చూడవచ్చని వారు వివరిస్తున్నారు.

**నిపుణులు సూచిస్తున్న కొన్ని ముఖ్యమైన చిట్కాలు:**

ఎస్పీఎఫ్ తప్పనిసరి: చర్మానికి 90% నష్టం సూర్యరశ్మి వల్లే కలుగుతుంది. అందుకే వాతావరణంతో సంబంధం లేకుండా ప్రతిరోజూ బ్రాడ్ స్పెక్ట్రమ్ ఎస్పీఎఫ్ (స్పాఫ్) 50 ఉన్న సన్‌స్క్రీన్ వాడటం తప్పనిసరి. ఇంట్లో ఉన్నప్పుడు కూడా కిటికీల నుంచి వచ్చే యూవీఏ కిరణాల నుంచి ఇది రక్షణ కల్పిస్తుంది. అసలు ఎస్పీఎఫ్ (స్పాఫ్) అంటే సన్ ప్రొటెక్షన్ ఫ్యాక్టర్. ఇది సూర్యుడి నుంచి వెలువడే హానికరమైన యూవీబీ కిరణాల నుంచి మన చర్మానికి ఎంత రక్షణ లభిస్తుందో సూచిస్తుంది. ఉదాహరణకు, ఎస్పీఎఫ్ 50 రాసుకుంటే, సాధారణం కంటే 50 రెట్లు ఎక్కువ సమయం చర్మం సురక్షితంగా ఉంటుందని అర్థం.తేమ (మాయిశ్చర్) కీలకం: చర్మం పొడిబారినట్లు అనిపిస్తే, హైల్యూరోనిక్ యాసిడ్ ఉన్న సీరమ్ లేదా మాయిశ్చరైజర్ వాడాలి. ఇది నీటిని ఆకర్షించి చర్మాన్ని లోపలి నుంచి తేమగా, కాంతివంతంగా మారుస్తుంది. ఆహారం, వ్యాయామం: ఆహారంలో యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండే కూరగాయలు, పండ్లు చేర్చుకోవాలి. అలాగే, రోజూ చేసే వ్యాయామం రక్త ప్రసరణను మెరుగుపరిచి చర్మానికి సహజమైన నిగారింపును ఇస్తుంది. మద్యపానానికి దూరంగా ఉండటం వల్ల చర్మం డీహైడ్రేట్ కాకుండా ఉంటుంది. యాక్టివ్ ఇంగ్రీడియంట్స్: చర్మం నిస్తేజంగా, డల్‌గా కనిపిస్తే రెటినాల్ (విటమిన్ ఎ) వాడకం మేలు చేస్తుంది. ఇది కొత్త కణాల ఉత్పత్తిని ప్రోత్సహించి చర్మాన్ని తాజాగా మారుస్తుంది. అయితే, దీనిని నిపుణుల సలహా మేరకు తక్కువ మోతాదుతో ప్రారంభించాలి.ఈ చిట్కాలతో పాటు తగినంత నిద్ర, ఒత్తిడిని జయించడం వంటివి పాటిస్తే చర్మం సహజంగానే ఆరోగ్యంగా, కాంతివంతంగా మారుతుందని నిపుణులు భరోసా ఇస్తున్నారు.




# ఒత్తిడిని తగ్గించుకోవాలంటే ఏం చేయాలో తెలుసా?

ఈ రోజుల్లో ఉద్యోగ రీత్యా లేదా ప్రేమ, డబ్బు లేదా ఫ్యామిలీ పరంగా ఏదయినా కారణం చేత చాలామంది టెన్షన్ లేదా ఒత్తిడికి గురవుతారు. దీని వలన మన మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. ప్రతి చిన్న దానికి ఎక్కువగా ఆలోచించడం వలన కూడా టెన్షన్, ఒత్తిడి వంటివి పెరుగుతాయి. మనం ఇతరులతో ఎలా మాట్లాడాలి వారు మనకు ఎలా స్పందిస్తారో ముందుగా ఊహించుకొని మనం అనుకున్న అంచానాలు రీచ్ అవ్వకపోయినా ఒత్తిడికి గురవుతారు. కాబట్టి మనం ప్రతి విషయంలో ఎలా జరిగిన దానిని స్వీకరించగలగాలి అంతేగాని దాని గురించి ఆలోచిస్తూ ఉండకూడదు. మన మూడ్ సరిగ్గా లేకపోయిన ఆ సమయంలో మనం తీసుకునే నిర్ణయాలు చెడుగా ఉంటాయి. దీని వలన మనం అవతలివారిలో నెగిటివిటీ ని పెంచిన వారమవుతాము. తరువాత మనం వారు మన గురించి ఏమి ఆలోచిస్తున్నారో అని అనుకుంటూ ఉంటాము ఇలా ఆలోచనలతో ఒత్తిడికి గురవుతాము. కాబట్టి మన మూడ్ బాగోలేనప్పుడు ఎటువంటి నిర్ణయాలు తీసుకోకపోవడమే మంచిది. లావుగా ఉన్నామని లేదా సన్నగా ఉన్నామని లేదా ఏదయినా మానసిక, శారీరక సమస్య వచ్చినా కొందరు చాలా బాధపడుతుంటారు. అంతే కానీ సమస్యకు పరిష్కారం వెతకరు. కాబట్టి మనం ఏదయినా సమస్య వచ్చినప్పుడు బాధపడకుండా దానికి పరిష్కారం వెతకాలి. ఈ మధ్య చాలామంది దానిలోనే సినిమాలు, సీరియళ్లు, షోస్ చూస్తున్నారు కాబట్టి దీని వలన మనం ఎక్కువ సమయం స్క్రీన్ మీద గడుపుతున్నారు. దీని వలన మెంటల్ హెల్త్ ఇష్యూస్ వచ్చే అవకాశం ఉంది. కాబట్టి మనం లో సినిమాలు, సిరీస్ లు చూసేటప్పుడు మద్యమద్యలో బ్రేక్ ఇస్తూ ఉండాలి దాని వలన మన ఆరోగ్యానికి మంచిది. ఒత్తిడి వలన మనకు గుండె సమస్యలు, ఆస్తమా, హైపర్ టెన్షన్, జుట్టు రాలడం వంటి సమస్యలు వస్తాయి. ఒత్తిడిని, టెన్షన్ ను తగ్గించుకోవడానికి మనం మొదట ఎక్కువగా ఆలోచించడం తగ్గించు కోవాలి. ఇంకా యోగా, ధ్యానం వంటివి చేస్తూ ఉండాలి. వీటి వలన రిలీఫ్ గా ఉంటుంది.



## సమృద్ధిగా వర్షాలు కురవాలి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో నాగార్జునసాగర్‌లో నిర్వహించిన వరుణ యాగం ముగిసింది.



**తెలంగాణ భూమి నాగార్జునసాగర్**

సమృద్ధిగా వర్షాలు కురవాలి.. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో నాగార్జునసాగర్‌లో నిర్వహించిన వరుణ యాగం ముగిసింది... కృష్ణా నది తీరంలోని విజయ విహార్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా వరుణ యాగం...108 మంది ఋత్వికులు, అర్చకుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున 4.05 గంటలకు యాగం ప్రారంభం...గోపూజ, అంకురార్పణ, ఋష్యశృంగ పూజతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహణ...వేదమంత్రోచ్చారణల మధ్య భక్తిశ్రద్ధలతో కొనసాగిన వరుణ యాగం.సాయంత్రం 3.24 గంటలకు పూర్ణాహుతితో ముగిసిన యాగం.పూర్ణాహుతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి దంపతుల పాల్గొనడం.సీఎం దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి పూర్ణాహుతి గావింపు.మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పెద్ద సంఖ్యలో హాజరు.వేదమంత్రోచ్చారణలతో మార్మోగిన విజయ విహార్ ప్రాంగణం.. ప్రశాంతంగా ముగిసిన వరుణ యాగం...

# తొలగించిన శిలాఫలకం పునరుద్ధరణ




**నల్లగొండ జిల్లా ప్రతినిధి.తెలంగాణ భూమి .**

గత వారం.. రింగ్ రోడ్డు కోసమని మర్రిగూడ బైపాస్ రోడ్ లో.. బుద్ధవనాన్ని తొలగించే ప్రయత్నం చేయగా స్థానిక బిఆర్ఎస్ దళిత నాయకులు.. ప్రజా సంఘాలు వారు అడ్డుకున్న సంగతి తెలిసిందే.. వారి ఆందోళన ఫలితంగా తొలగించిన బేస్మెంట్ ను యధావిధిగా కాంక్రీట్ తో నిర్మాణం చేశారు కానీ... నాటి మంత్రివర్యులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి స్థానిక శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి ప్రారంభించిన,బుద్ధవనం ప్రారంభ శిలాఫలకాన్ని తొలగించారు.. అప్పుడే శిలాఫలకాన్ని కూడా యధావిధిగా పునరుద్ధరిస్తామని చెప్పినప్పటికీ... అలానే వదిలేశారు. తిరిగి సోమవారం వారు అధికారులను... ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే శిరాఫలకాన్ని పునరుద్ధరించాలని లేకుంటే తిరిగి ఆందోళన చేపడతామని తెలియజేయడంతో అధికారులు దిగివచ్చి వెంటనే శిలాఫలకాన్ని యధావిధిగా ఏర్పాటు చేశారు. దీనితో బిఆర్ఎస్ పార్టీ నాయకులు సంతృప్తి చెందారు. ఈ కార్యక్రమంలో పెరిక కరణ్ జయరాజ్, జమాల్ ఖాద్రి కందుల లక్ష్మయ్య, కొండేటి మహేష్, కొప్పోలు అశోక్ తదితరులు వెంటఉన్నారు

## ఘనంగా నిజాంపేట్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ పుట్టినరోజు వేడుకలు

**నిజాంపేట్, ఆగస్ట్ 10 తెలంగాణ భూమి :**



ఈరోజు నిజాంపేట్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని శంభీపూర్ లోని నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేయించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణభూమి
తెలుగు దినపత్రిక

## ముందు కాల్చి, తర్వాతే మాట్లాడతాం..
## 'స్లమ్‌డాగ్' నుంచి టబు పవర్‌ఫుల్ గ్లింప్స్!



స్టార్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్, ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో వస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్లమ్‌డాగ్ – 33 టెంపుల్ రోడ్'. ఈ సినిమాపై మొదటి నుంచి భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ చిత్రం నుంచి, కీలక పాత్ర పోషిస్తున్న సీనియర్ నటి టబు క్యారెక్టర్ గ్లింప్స్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ వీడియో సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. ఈ సినిమాలో టబు 'గౌరీ హెగ్డే' అనే పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. గ్లింప్స్ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ.. "భయంలేని, శక్తివంతమైన, ధైర్యవంతురాలు. భారతీయ సినిమా రత్నం టబును గౌరీ హెగ్డేగా పరిచయం చేస్తున్నాం" అని పూరి జగన్నాథ్ పేర్కొన్నారు. విడుదలైన వీడియోలో టబు తన పాత్రలో ఒదిగిపోయారు. కొందరిని కొడుతూ, బెదిరిస్తూ పవర్‌ఫుల్ ఆఫీసర్‌గా కనిపించారు. "మా స్టైల్‌లో మేము ముందు కాల్చి, ఆ తర్వాత మాట్లాడతాం" అంటూ విజయ్ సేతుపతికి ఆమె చెప్పే డైలాగ్ గ్లింప్స్‌కే హైలైట్‌గా నిలిచింది. చివర్లో "గౌరీ హెగ్డే – డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్" అని ఆమె తన హోదాను వెల్లడించడం ఆకట్టుకుంది. గతేడాది జులైలో ప్రారంభమైన ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయిందని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయని చిత్ర వర్గాలు తెలిపాయి. గతంలో విడుదల చేసిన టైటిల్ పోస్టర్‌లో విజయ్ సేతుపతి చేతిలో కత్తి, చుట్టూ డబ్బు కట్టలతో కనిపించి సినిమాపై క్యూరియాసిటీ పెంచారు. ఈ చిత్రాన్ని పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్.. జేబీ మోషన్ పిక్చర్స్‌తో కలిసి జేబీ నారాయణరావు కొండ్రొళ్ల నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో విజయ్ సేతుపతి సరసన సంయుక్త హీరోయిన్‌గా నటిస్తుండగా, కన్నడ స్టార్ దునియా విజయ్ ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. బ్రహ్మాజీ, వీటీవీ గణేష్ వంటి నటులు ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. 'అర్జున్ రెడ్డి' (నేపథ్య సంగీతం), 'యానిమల్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలకు సంగీతం అందించిన హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## కొడుక్కి రామ్ చరణ్ పేరు.. అభిమాని ప్రేమకు ఫిదా.. ఇంటికి పిలిచిన చిరంజీవి!

**'మెగా 158' సెట్స్‌లో టెక్నీషియన్‌ను పలకరించిన చిరంజీవి**

**రామ్ చరణ్ వీరాభిమానినని, కొడుక్కి ఆయన పేరే పెట్టానని వెల్లడి**

**భావోద్వేగానికి గురై టెక్నీషియన్ కుటుంబాన్ని ఇంటికి ఆహ్వానించిన మెగాస్టార్**

**అభిమాని ఫ్యామిలీతో సమయం గడిపిన చిరంజీవి, రామ్ చరణ్**

మెగాస్టార్ చిరంజీవి తన అభిమానులను సొంత కుటుంబ సభ్యుల్లా చూస్తారనడానికి మరో సంఘటన నిదర్శనంగా నిలిచింది. ఓ సాధారణ టెక్నీషియన్ చూపిన అభిమానానికి ముగ్ధుడై, అతడి కుటుంబాన్ని ఇంటికి ప్రత్యేకంగా ఆహ్వానించి ఆశ్చర్యపరిచారు. ఈ ఆత్మీయ భేటీలో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కూడా పాల్గొనడం విశేషం. ఈ హృద్యమైన ఘటన ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే.. ప్రస్తుతం చిరంజీవి 'మెగా 158' సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ చిత్రానికి కెమెరా విభాగంలో పనిచేస్తున్న నివాస్ అనే టెక్నీషియన్‌ను చిరంజీవి పలకరించారు. మాటల సందర్భంలో నివాస్ తాను రామ్ చరణ్‌కు వీరాభిమానినని, ఆ అభిమానంతోనే తన కుమారుడికి 'జస్వంత్ రామ్ చరణ్' అని పేరు పెట్టుకున్నానని చిరంజీవితో చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న మెగాస్టార్ ఎంతో సంతోషించి, భావోద్వేగానికి గురయ్యారు. వెంటనే నివాస్‌ను తన కుటుంబంతో సహా ఇంటికి రావాలని ప్రేమగా ఆహ్వానించారు. మెగాస్టార్ పిలుపుతో ఆనందంలో మునిగిపోయిన నివాస్, తన కుటుంబంతో కలిసి ఆయన నివాసానికి వెళ్లారు. అక్కడ వారికి మరో సర్‌ప్రైజ్ ఎదురైంది. చిరంజీవితో పాటు రామ్ చరణ్ కూడా వారిని ఆప్యాయంగా పలకరించి, వారితో సమయం గడిపారు. ముఖ్యంగా చిన్నారి జస్వంత్ రామ్ చరణ్‌తో చరణ్ కాసేపు సరదాగా గడిపారు. అనంతరం నివాస్ కుటుంబంతో కలిసి చిరు, చరణ్ ఫొటోలు దిగారు. ఈ అరుదైన క్షణాలకు సంబంధించిన ఫొటోలు బయటకు రావడంతో మెగా అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ హీరోల గొప్ప మనసును ప్రశంసిస్తూ కామెంట్లు పెడుతున్నారు. ఓ సాధారణ అభిమానికి మెగా ఫ్యామిలీ ఇచ్చిన గౌరవం, వారి మధ్య ఉన్న బంధానికి నిదర్శనమని అంటున్నారు.







## రవితేజ 'ఇరుముడి' ట్రైలర్ రిలీజ్ పై స్పెషల్ పోస్టర్

మాస్ మహారాజా రవితేజ, విజయవంతమైన దర్శకుడు శివ నిర్వాణ కాంబినేషన్‌లో వస్తున్న కొత్త చిత్రం 'ఇరుముడి'. ఈ సినిమా ట్రైలర్ ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో, ఈ చిత్రబృందం ప్రమోషన్ల స్పీడు పెంచింది. ఈ క్రమంలో, అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఇరుముడి' థియేట్రికల్ ట్రైలర్ ను ఆగస్టు 12న విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో భారీ స్థాయిలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించబోతున్నారు. భీమవరంలోని ఎస్ఆర్కేఆర్ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో ఆ రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఈ కార్యక్రమం జరగనుంది. ఈ మేరకు చిత్ర యూనిట్ ఒక ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. "తన కుటుంబాన్ని కాపాడేందుకు ఓ వ్యక్తి విశ్వాసాన్నే తన అతిపెద్ద ఆయుధంగా మార్చుకుని చేసే ప్రయాణమే ఈ సినిమా" అంటూ విడుదల చేసిన ట్యాగ్‌లైన్, 'ఇరుముడి' అనే టైటిల్ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. భక్తి, కుటుంబ భావోద్వేగాల కలబోతగా ఈ సినిమా ఉండబోతున్నట్టు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని ప్రఖ్యాత నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్, టీ-సిరీస్‌తో కలిసి నిర్మిస్తోంది. ఇందులో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సాయికుమార్, బేబీ నక్షత్ర కీలక పాత్రలు పోషిస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమాపై అభిమానుల్లో, సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి.

## కిరణ్ అబ్బవరం 'ఇంద్రపుత్ర'.. పాన్ ఇండియా స్థాయిలో భారీ మైథలాజికల్ చిత్రం

వరుస విజయాలతో మంచి ఫామ్‌లో ఉన్న యువ హీరో కిరణ్ అబ్బవరం తన కెరీర్‌ను మరో స్థాయికి తీసుకెళుతున్నారు. ప్రాంతీయ చిత్రాల పరిధిని దాటి పాన్ ఇండియా స్థాయిలో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. ఆయన కథానాయకుడిగా 'ఇంద్రపుత్ర' అనే భారీ మైథలాజికల్ యాక్షన్ ఫాంటసీ చిత్రాన్ని సోమవారం అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన టైటిల్ పోస్టర్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఇది కిరణ్ కు 15వ చిత్రం. ప్రముఖ నిర్మాణ సంస్థ జీ స్టూడియోస్, గతంలో సుధీర్ బాబుతో 'జటాధార' నిర్మించిన ప్రేరణ అరోరా ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. శ్రీకాంత్ పుప్పాల ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు దర్శకత్వం వహించనున్నారు. ధర్మానికి, అధర్మానికి మధ్య జరిగే యుద్ధం నేపథ్యంలో రాబోయే ఒక సినిమాటిక్ యూనివర్స్‌లో ఇది తొలి భాగంగా ఉంటుందని చిత్రబృందం తెలిపింది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ 2026 అక్టోబరులో ప్రారంభం కానుంది. 2027లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. కెరీర్ ఆరంభంలో కొన్ని పరాజయాలు, సోషల్ మీడియాలో ట్రోలింగ్ ఎదుర్కొన్న కిరణ్ అబ్బవరం, ఇటీవల కాలంలో బలంగా పుంజుకున్నారు. 'కా', 'కే రాంప్', 'చెన్నై లవ్ స్టోరీ' వంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధించి ఆయనకు మంచి మార్కెట్‌ను అందించాయి. ఈ విజయాలతో వచ్చిన ఆత్మవిశ్వాసంతోనే ఆయన ఇప్పుడు పాన్ ఇండియా ప్రాజెక్టులపై దృష్టి సారించారు. ప్రస్తుతం కిరణ్ చేతిలో పలు ఆసక్తికరమైన ప్రాజెక్టులు ఉన్నాయి. తన 13వ చిత్రంగా 'రియాలిటీ' అనే సినిమాను స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. జాయ్ ఫిల్మ్స్ పతాకంపై సుధాకర్ చాగంటి నిర్మిస్తున్న ఈ చిత్రంతో కన్నడ నటి దేవిక భట్ పరిచయమవుతున్నారు. ఈ సినిమాను 2026 డిసెంబరులో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. దీనితో పాటు సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌పై వీర కొగటం దర్శకత్వంలో ఓ క్రైమ్ థ్రిల్లర్‌లో కూడా కిరణ్ నటిస్తున్నారు. వరుస చిత్రాలతో బిజీగా ఉంటూనే, 'ఇంద్రపుత్ర' వంటి భారీ చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో తనదైన ముద్ర వేయాలని కిరణ్ అబ్బవరం పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు.




Printed,Published and Owned by : **Konda Narasimha swamy** PRINTED AT **: KOUSAYA PRINTERS ,** H.NO 6-1-948 BOYAWADA STREET, DIST: NALGONGA TELANGANA 508001. RNI NO - **TGTEL/2018/75056.** CELL NO : 7989870511.